కథ

గోగిశెట్టి చెంచు మోహన్ నాయుడు

# చివరికి మిగిలేది

మా నారాయణ చేస్తున్న పనులేంటో నాకు అసలు అర్థంకావడం లేదు. బుర్ర ఉండే చేస్తున్నాడో లేక చేస్తున్నాడో తెలియడం లేదు. మొన్నటికి మొన్న అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన వారికి పది లక్షలు ఖర్చుపెట్టి పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చాడు. నిన్నగాక నిన్న వరదలొచ్చి ఇళ్లు కొట్టుకుపోయినవారికి మరో పది లక్షలు పెట్టి ఇళ్లు కట్టించి ఇస్తానన్న వాగ్దానం చేశాడు.

ఇలాంటివి కాక వాళ్ల ఊళ్లో ఒక గుడి కట్టించాడు. వాళ్ల ఊరి పిల్లలు కాలేజీకి చాలా దూరం వెళుతున్నారని వాళ్ల ఊళ్లోనే జూనియర్ కాలేజీని పెట్టించాడు. మెడిసిన్, ఇంజనీరింగ్ లాంటి కోర్సులలో సీట్లు వచ్చి, ఖర్చు పెట్టి చదివే స్థోమత లేని వారికి స్కాలర్‌షిప్‌లు ఇస్తూ చదివిస్తున్నాడు. దాని కోసం ఒక ట్రస్టు కూడా ఏర్పాటు చేశాడు. ఎన్నో లక్షల రూపాయలు ఇలా వృథాగా ఖర్చుపెడుతున్నాడు. నిజం చెప్పాలంటే తన సంపాదనంతా మందికి దోచిపెడుతున్నాడు. ఇలా అయితే ఆస్తి హారతికర్పూరమై పోదూ?

మంచితనానికి కూడా ఒక అర్థం ఉండాలి. సంపాదించిందంతా ఇలా దానధర్మాలు చేసుకుంటూ పోతే తన వాళ్లకు మిగిలేదేమిటి? ఊళ్లో జనం గురించి ఆలోచిస్తున్నాడు గానీ తన ఇంట్లో జనం గురించి ఆలోచిస్తున్నట్లు లేదు. అప్పటికి వీడే గొప్ప దానకర్ణుడైనట్లు. మేం మాత్రం ధర్మాలు చేయడం లేదా! మొన్నెవరో గుడి కడుతున్నామంటే ఐదొందలా పదహార్లు ఇచ్చా ఘనంగా. ఇంకెవడో ఏదో అడిగితే రెండొందలా పదహార్లు, నూటా పదహార్లూ ఇస్తూనే ఉన్నా. ఏం? మేం చేసింది దానం కాదూ! లక్షలు ఇస్తేనే దానం చేసినట్లా?

ఇదంతా నాకెందుకుగానీ నా కూతురు వాడింటి కోడలాయె. అందుగురించి ఆలోచించాల్సి వస్తుంది. లేకపోతే వాడు దానాలు చేసుకుంటే నాకెందుకూ ధర్మాలు చేసుకుంటే నాకెందుకూ!

అసలు నాకు అర్థంకాని విషయం ఏంటంటే నారాయణకు ఈ దానధర్మాల పిచ్చిపట్టి ఓ రెండు మూడేళ్లే అయి ఉంటుంది. అంతకు ముందు నాలాగే ఉండేవాడు. ఈ రెండు మూడేళ్లలో వాడిలో ఈ మార్పు ఎలా వచ్చిందో ఎందుకొచ్చిందో అర్థం కావడం లేదు.

నారాయణ, నేను పక్కపక్క ఊరివాళ్లం. హైస్కూల్ చదువులో స్నేహితులమయ్యాం. పైగా దూరపు బంధుత్వం కలిసింది. డిగ్రీ దాకా కలిసే చదువుకున్నాం. డిగ్రీ తరువాత బ్రతుకు తెరువుకై ఇద్దరం విజయవాడ వచ్చాం. మమత ట్రాన్స్‌పోర్ట్ అనే కంపెనీ మా ఊరి పెద్దిశెట్టిగారిది. అందులో చేరాం. పదేళ్లపాటు కష్టపడి పనిచేశాం. పెళ్లిళ్లు చేసుకుని ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చి జీవితంలో స్థిరపడ్డాం. వ్యాపార మెళకువలన్నీ మాకు అలవడ్డాయి. మా హుషారు, నమ్మకం, మంచితనం చూసిన మా ఓనరు తన పెద్ద మనసుతో

“ఏమయ్యా! ఇలా ఎంతకాలం నా దగ్గర ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. మీకు పెళ్లిళ్లయి పిల్లలు కూడా పెద్దవాళ్లవుతున్నా. వాళ్ల చదువులకీ వాటికీ ఖర్చులు కూడా పెరుగుతుంటాయి. మీ తెలివితేటలకి మీరే సొంతంగా మరో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని ఎందుకు పెట్టుకోకూడదూ” అన్నాడు.

“భలేవాళ్లు సార్ మీరు. మేమిలా సంతోషంగా ఉండటం మీకిష్టం లేదా ఏమిటి? కంపెనీ లేదూ గింపెనీ లేదు. మేమిక్కడే ఉంటాం. మాకు మీ దగ్గరే బాగుంది” అన్నాం.

“అలా అనడం మీ మంచితనం. ఆ మంచితనమే మీలో నాకు నచ్చింది. మీకు వయసుంది. కష్టపడే తత్వముంది. వ్యాపారం చేసే తెలివితేటలున్నాయి. మనస్ఫూర్తిగా చెబుతున్నాను, పెట్టుబడి నేను పెడతాను. మీరు మరో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పెట్టండి” అంటూ మా చేత జనతా ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని పెట్టించాడు ఆ మహానుభావుడు.

మేం రాత్రింబవళ్లు కష్టపడ్డాం. వ్యాపారం కలిసొచ్చి లక్షలు సంపాదించాం. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో వచ్చిన దానితో మరో వ్యాపారంలోకి అడుగుపెట్టాం. అక్కడా మాకు ఎదురు లేదు. కోట్లకు పడగెత్తాం. అయినా మా మధ్య ఎటువంటి పొరపొచ్చాలూ రాలేదు. మా స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకున్నాం. వాడి కొడుక్కి నా కూతుర్నిచ్చి పెళ్లి చేశాం.

ఏ బాదరాబందీ లేకుండా ఇప్పుడు హాయిగా ఉన్నాం. ఒకళ్ల ప్రసక్తి మనకెందుకు? ఎవరెట్లా పోతే మనకేంటి? అందర్నీ ఉద్ధరించడానికి మేమేమన్నా దేశోద్ధారకులమా! నా పాలసీ అది. మేం బీదరికంలో ఉన్నప్పుడు ఎవరైనా మమ్మల్ని ఆదుకున్నారా! ఎవరైనా పై చదువులకి సాయం చేశారా! ఏదో ఆ భగవంతుడి దయ వలన, మా ఊరి పెద్దిశెట్టిగారి చేతి చలువ వలన నాలుగురాళ్లు వెనకేసుకున్నాం గానీ, లేకుంటే మేమూ బికారులమేగా.

కారుకి ఏదో అడ్డంగా వచ్చినందున డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో నా ఆలోచనలకి కూడా బ్రేక్ పడింది.

“ఇదిగో అబ్బాయ్! కొంచెం జాగ్రత్తగా డ్రైవ్ చెయ్. ఇదేమన్నా హైవే రోడ్డనుకున్నావా” అంటూ డ్రైవర్‌కి చెప్పాను. కారు మళ్లీ బయలుదేరింది.

ఈరోజు మా నారాయణ ఊళ్లో మంచినీటి పథకానికి ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంది. కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వస్తున్నారు. నారాయణ నిన్ననే వెళ్లి అక్కడ ఏర్పాట్లు చూస్తున్నాడు. నన్ను కూడా నిన్ననే రమ్మన్నాడు. నాక్కొంచెం అర్జెంటు పని ఉండి ఈ రోజు ఉదయం బయలుదేరాను.

ఇపుడు ప్రారంభించబోయే మంచినీటి పథకానికి కూడా దాదాపు పది లక్షలు ఖర్చుపెట్టాడు. వాళ్ల ఊరి జనం మంచినీళ్ల కోసం రెండు మైళ్ల దూరాన ఉన్న దొరువుబావి దగ్గరకు నడిచివెళ్లో, సైకిల్‌పై వెళ్లో తెచ్చుకుని తాగుతుండేవారు. వాళ్ల ఇబ్బందులు చూడలేక దొరువుబావిని వెడల్పు చేసి, అక్కడి నుండి పైప్‌లైన్ ద్వారా ఊళ్లో కట్టించిన ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లో నింపి, ట్యాంక్ నుండి ఊళ్లోని ప్రతి వీధికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాడు. ఇదంతా నీకెందుకూ, గవర్నమెంటోళ్లు చేస్తారు కదా” అని చెప్పాను.

“ఆ! చేస్తున్నారు. యాభై ఏళ్ల నుండీ చేస్తూనే ఉన్నారు. ఎన్నో ప్రభుత్వాలు వస్తున్నాయి.. పోతున్నాయి. ఐదేళ్లకోసారి ఓట్లు వేస్తున్నారు. నాయకులను గెలిపిస్తున్నారు. కానీ ఒక్కడైనా ఊళ్లోకి నీళ్లొచ్చే ఏర్పాట్లు చేశాడా? అందుకే నేనే సొంతంగా నా ఊరికి, ప్రజలకి మేలు చేసే ఈ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నాననీ” చెప్పాడు. ఎవడి పిచ్చి వాడికానందం. మనమేం చెయ్యగలం. చెప్పేవాళ్లమే కదా. అందుకే వదిలేశా.

కారు మా నారాయణ ఊరు చేరేసరికి ఊరంతా కోలాహలంగా ఉంది. ఎక్కడ చూసినా స్వాగత తోరణాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు, అనధికారులు హడావిడిగా తిరుగుతున్నారు. కారు దిగిన నేను నారాయణ కోసం వెతుకుతున్నాను. హడావిడిగా తిరుగుతున్న నారాయణ నన్ను చూసి నా దగ్గరకొచ్చాడు. “ఏంట్రా! ఇప్పుడు రావడం! నిన్న రావలసిన వాడివి. ఏదో అర్జెంటు పని ఉందంటే సరే అన్నాను. ఇవాళన్నా పెందలాడే రాకూడదూ?” అన్నాడు.

“నారాయణా! మీ ఊరి రోడ్డేమన్నా హైవేనా? గుంటలమయం రా బాబూ! కారు ముప్పైకి మించి స్పీడు పోవట్లేదు, నన్నేం చెయ్యమంటావ్. సరే ఇంతకీ ఏర్పాట్లన్నీ సజావుగా జరుగుతున్నాయా” అడిగాను నా తప్పు కప్పిపుచ్చుకుంటూ.

“ఆ అన్నీ జరిగిపోతున్నాయ్. కలెక్టర్‌గారూ, మంత్రులు ఓ పది నిమిషాల్లో వస్తారు. నువ్వెళ్లి ఆ భోజనాలు తయారయ్యే దగ్గర ఏర్పాట్లు ఎలా ఉన్నాయో చూడు” అంటూ నాకొక పని పురమాయించి ఎవరో పిలవడంతో హడావిడిగా అటు వెళ్లాడు.



ఒక అరగంట తరువాత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్‌గారు వచ్చారు. అట్టహాసంగా మంచి నీటి పథకం ప్రారంభోత్సవం జరిగింది. ఊళ్లోని ప్రతి వీధిలో ఏర్పాటు చేసిన కుళాయిల్లోకి నీరు వదిలారు. నీళ్లు పట్టుకునేందుకు వచ్చిన ఆడామగా, ముసలీ ముతకా, పిల్లాపీచూ అందరూ "హే.. మా ఊళ్లోకి మంచినీళ్లొచ్చాయ్.. మా ఊళ్లోకి మంచినీళ్లొచ్చాయ్" అంటూ ఆనందంతో కేకలు వేస్తున్నారు. అందరి కళ్లల్లోనూ ఏదో చెప్పలేని సంతోషం. ఏదో సాధించామనే తృప్తి. అందరూ కలిసి చిందులేస్తున్నారు. నిజం చెప్పాలంటే వాళ్ల సంతోషం చూసి నాకు ముచ్చటేసింది.

నేను ఊళ్లోని ప్రతి వీధి తిరిగాను జనం ఏమనుకుంటున్నారో అని. ఒక ముసలాయనను పలకరించాను. "అయ్యా! ఇన్నాళ్లకు మా కల తీరింది. మా నారాయణయ్య దయ వలన మేం ఇవాళ నుండి గుక్కెడు మంచి నీళ్లు తాగగలుగుతున్నాం. ఆ అయ్య చల్లగుండాలయ్యా" అంటూ తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు. "డబ్బులుండగానే సరిపోద్దంటయ్యా? ధర్మం చేసే దమ్ముండొద్దూ! ఆ దమ్మున్న నారాయణయ్య మా ఊరి వాడైనందుకు మాకిన్ని మంచినీళ్లు పోస్తున్నాడు" అంటూ ఓ ముప్పై ఏళ్ల వ్యక్తి సంతోషం.

ఇలా ప్రతి వీధిలోనూ ఇలాంటి మాటలే. ఇప్పుడు నారాయణ వాళ్ల దృష్టిలో నీరుపోసిన దేవుడు. ఊరు ఊరంతా ఆనందంతో ఊగిపోతోంది. నిజంగా వీడు మంచిపనే చేసినట్లుందని మొదటిసారి నాకూ అనిపించింది.

కార్యక్రమమంతా సజావుగా పూర్తయింది. మీటింగ్‌లో పాల్గొన్న వక్తలందరూ నారాయణ మంచితనాన్ని, సేవానిరతిని కొనియాడారు. ఊరివాళ్ల దగ్గర సెలవు తీసుకుని విజయవాడ బయలుదేరాం. నా కారు టైర్ పంక్చర్ కావడంతో నేను కూడా నారాయణ కార్లోనే వెళ్లాల్సి వచ్చింది.

ఇద్దరం వెనుకసీట్లో కూర్చుని, జరిగిన కార్యక్రమం గురించి చర్చించుకుంటున్నాం. "ఒరేయ్, నారాయణా! నాకొక డౌట్‌రా? నువ్వు ఈ దానధర్మాలు చేయడం మొదలుపెట్టి రెండు మూడేళ్లే కదా అయింది. సడన్‌గా నీలో ఇంత మార్పు ఎందుకొచ్చింది? ఇలా లక్షలు లక్షలు తగలేస్తున్నావే! ఆలోచించే ఈ పనులు చేస్తున్నావా? అయినా నీ డబ్బులు నీ ఇష్టం గానీ, ఎంతైనా స్నేహితుణ్ని కదా! నిన్ను హెచ్చరించడం నా ధర్మం కాబట్టి నిన్నొక మారు హెచ్చరిస్తున్నాను" అన్నాను.

"ఒరేయ్ సుబ్బారావ్! నువ్వెందుకు నాకు నీతులు బోధిస్తున్నావో తెలుసులేరా. ఇలా దానధర్మాలు చేస్తూ పోయి నీ కూతురికీ, అల్లుడికి ఏమి మిగల్చననే కదూ నీ భయం" అన్నాడు.

"నా మనసులో ఉన్నమాట ఉన్నట్లుగా కరెక్ట్‌గా చెప్పాడే వెధవ" అనుకుంటూ "ఛ..ఛ... నాకలాంటి ఉద్దేశాలు లేవురా. అయినా వాళ్లు నీ కొడుకూ.. కోడలూ.. మధ్యలో నాకెందుకు" అన్నాను పైకి.

"సుబ్బారావ్! నీకో విషయం చెప్పాలిరా" అన్నాడు.

"చెప్పరా" అన్నాను.

"మనం మనుషులమే కదూ?"

'బిత్తరపోయాను, సడన్‌గా ఇలాంటి ప్రశ్న వేశాడేమిటా అని.'

"ఆ డౌటెందుకురా! మనుషులమే" బదులిచ్చాను.

"మరి, మనుషులమైనప్పుడు మనలో కొంచెం అయినా మానవత్వం ఉండాలి కదరా!"

ఏమనాలో తెలియక "ఉండాలి కదరా" అన్నాను.

"ఆ మానవత్వమే కొంచెం నాలో ఉండబట్టి మనిషిగా ఆలోచించి కష్టాల్లో ఉన్న సాటి మనుషులకి నాకు చేతనయినంత సాయం చేస్తున్నాను. అలా అని నేను తనకు మించిన ధర్మానికి పోవడం లేదు. నాకున్న ఆర్థిక పరిధులలోనే సాయపడుతున్నాను. అయినా నాకు తెలియక అడుగుతాను సుబ్బారావ్, మనం సంపాదించిన ఈ కోట్ల రూపాయలను మనతో పాటు పట్టుకుపోగలమా! చెప్పరా."

"పట్టుకుపోలేంరా" అన్నాను.

"ఆ జీవిత సత్యమే తెలుసుకొన్నాను" అన్నాడు.

"ఎలారా" అడిగాను కుతూహలంగా. నారాయణ చెప్పడం మొదలుపెట్టాడు.

కొన్నాళ్ల క్రితం మా ఊళ్లో గుడి కడుతున్నామంటూ మా ఊరివాళ్లు కొంతమంది చందా కోసం నా దగ్గరకొచ్చారు. ఇంత దూరం నన్ను వెతుక్కుంటూ వచ్చారు కాబట్టి ఒక వెయ్యినూట పదహార్లు ఇద్దామనుకొని, అదే మాట వాళ్లకు చెప్పాను.

"నువ్వే అలాగంటే ఎలా నారాయణా? ఈమధ్య సరిగా పంటలు పండక రైతులంతా అప్పులపాలయ్యారు. ఊరి పరిస్థితి ఏం బాగాలేదు. అందుకనే నీదాకా రావల్సి వచ్చింది. కొంచెం పెద్ద మనసు చేసుకొని పెద్ద సాయం చెయ్యవయ్యా. ఒక లక్ష రూపాయలు ఇస్తే ఎలాగోలా గుడి పని పూర్తి చేస్తాం." అన్నాడు ఊరి వాళ్లలోకి పెద్దగా వచ్చిన రామన్న.

"లక్ష రూపాయలా! అమ్మో" అన్నాను నోరెళ్లబెట్టి. "అంత నా వల్ల కాదు రామన్నా. కాకపోతే ఓ ఐదువేలు ఇస్తాను" అన్నాను.

"నారాయణా! నువ్వేమనుకోకుంటే నీకొక విషయం చెబుతాను వింటావా" అన్నాడు రామన్న.


"చెప్పు" అన్నాను.

"ప్రస్తుతం నువ్వు కోటీశ్వరుడివి. ఒక లక్ష రూపాయలంటే నీకు లెక్క లేదు. కానీ, డబ్బుమీది మమకారం నిన్నలా మాట్లాడిస్తుంది. కేవలం డబ్బును మాత్రమే ప్రేమించకు. నిన్ను నువ్వు ప్రేమించుకో. నీ కుటుంబాన్ని ప్రేమించు. నువ్వు పుట్టిన ఊరిని ప్రేమించు. డబ్బు పాపిష్టిది. అది మనిషిని రాక్షసుణ్ని చేస్తుంది. డబ్బు కోసం మనిషి ఎంత నీచానికయినా దిగజారుతున్నాడు. దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నాడు. హత్యలు, మోసాలు, కుట్రలు, దగా... ఒకటేమిటి? డబ్బు మాయలో పడి మనిషి తను మనిషేనన్న సంగతే మరిచిపోతున్నాడు. మనిషికి తెలియదు, తను ఇంతగా ప్రేమించే డబ్బు తను చస్తే తన వెంట రాదు అని. అది తెలుసుకోలేక మనిషి ఇలా ప్రవర్తిస్తున్నాడు. సంస్కృతంలో ఒక శ్లోకం ఉంది...

'ధనాని భూమౌ, పశువశ్చ గోష్ఠే
నారీ గృహద్వారీ, జన స్మశానే
దేహశ్చితాయామ్, పరలోక మార్గే
కర్మాను గచ్ఛతి జీవ ఏకః'

అంటే అర్థం నువ్వు సంపాదించిన ధనము, నగలు నీ బీరువా వరకే... నీ పశు సంపద కొష్ఠం వరకే... నీ భార్య గృహద్వారం వరకే... నీ కొడుకులు, బంధువులు స్మశానం వరకే... ఆఖరికి నువ్వు ఎంతో ఇష్టంగా చూసుకునే నీ శరీరం కూడా చితి వరకే వస్తాయి. ఆపైన పరలోక యాత్రకు నీతో వచ్చేదెవరు? నీ పాపపుణ్యాలే" అని అర్థం. కాబట్టి నువ్వు నీతో పాటు తీసుకెళ్లలేని డబ్బుపై ఎందుకంత మమకారం. కాస్త మంచి పనులు చేస్తుండు. మంచి పనులు చేసే మనుషులకి సాయం చేస్తుండు. నేను చెప్పిన విషయాలు ఆలోచించు. ఆలోచించి ఓ మంచి నిర్ణయం తీసుకో. అప్పుడు నువ్వెంత చందా ఇచ్చినా తీసుకుంటాం. వస్తాం నారాయణా" అని చెప్పి వాళ్లు వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లాక నేను ఆలోచనలో పడ్డాను. ఆయన చెప్పిన దానిలో నిజం ఉందనిపించింది. మనం ఇంత సంపాదిస్తున్నాం, ఇనప్పెట్టెల్లో దాచిపెడుతున్నాం. మనం చస్తే తీసుకువెళ్లగలమా? లేదే. మరి దాంతో మనకేంటి ఉపయోగం? ఆ డబ్బుతో ఎవరికైనా సాయపడదాం. ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం. కాస్త పుణ్యం మూట కట్టుకుందాం అనిపించింది.



అనామకులుగా మిగిలిపోకుండా చచ్చినా బ్రతికుండేట్లు మంచి పనులు చెయ్యాలనుకొని నిర్ణయించుకొన్నాను. మరుసటి రోజే మా ఊరెళ్లాను. మా వాళ్లందర్నీ కలుసుకున్నాను. గుడి నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చు ఐదు లక్షలు మా ఊరి పెద్దలకిచ్చి వాళ్ల ఆప్యాయతానురాగాలను పొందాను. ఇక అప్పటి నుండీ నాకు చేతనైనంత సాయం పదిమందికీ చేస్తున్నాను. అదీ సుబ్బారావ్! నాలో మార్పుకి కారణం. ఇప్పుడు చెప్పు నేను చేస్తున్నది తప్పా? ఒప్పా?" అంటూ ముగించాడు.

"నారాయణ! ఈ రామన్న చెప్పిన మాటలకి నీకు జ్ఞానోదయం కలిగితే, ఇప్పుడు నీ మాటలు విన్న నాకు జ్ఞానోదయమైందిరా. నా కళ్లకు కమ్మిన డబ్బు పొర తొలగింది. నువ్వు చేస్తున్న పని ముమ్మాటికీ ఒప్పు. ఈరోజు మీ ఊరి వాళ్ల కళ్లల్లో నీ పట్ల ఉన్న అభిమానం స్వయంగా చూశాను. గుడి, బడి కట్టించాడు. నీళ్లు పోశావ్. నువ్వున్నా లేకపోయినా నీ పేరు తరతరాలు మీ ఊళ్లో వినబడుతూనే ఉంది. నువ్వు పోయినా బ్రతికుంటావ్‌రా. మనిషికి అంతకన్నా కావల్సిందేముంది. వ్యాపారంలో భాగస్వాములైనట్లు ఇలా మంచి పనులు కూడా ఇక కలిసే చేద్దాంరా. మనిషికి మానవత్వం వరం అని నిరూపిద్దాంరా" అన్నాను.

శభాష్‌రా సుబ్బారావ్ అని నా భుజం తట్టాడు నారాయణ కారు దూసుకుపోతోంది నా మనసులాగే తేలికపడి.

## సొంత గొంతు!

గతంలో టాప్ హీరోయిన్ స్థాయికి ఎదిగిన అసలు సిసలు తెలుగమ్మాయి విజయశాంతి సైతం అరువు గొంతుతోనే తెరపై డైలాగులు వినిపించేది. ఆమధ్యనే సొంతంగా చెప్పడం అలవాటు చేసుకుంది. ఇలాగే తమిళ భామ త్రిష తన పాత్రకి తనే డబ్బింగ్ చెప్పాలని తాజాగా నిర్ణయించుకుందిట. స్వతహాగా తమిళ అమ్మాయి అయివుండీ ఇంత దాకా గొంతుని అరువు తెచ్చుకుంటూ వస్తోన్న త్రిష ఇకపై తనే సొంతంగా డైలాగులు చెప్పాలనుకుంటోందిట. మరి తెలుగులోనూ డైలాగులు చెప్పడానికి త్రిష ట్రయ్ చేస్తుందేమో!